

కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ.12,80,943

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. అమ్మవారి జాతర సందర్భంగా 76 రోజులకు గాను రూ. 12,80,943 హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు దేవాలయ శాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు.

ఊబిలో నుంచి ఉత్తమస్థాయికి..

- ఐదేళ్ల క్రితం రూ.12 లక్షల నష్టాల్లో డీసీఎంఎస్
- ఇప్పుడు ప్రతీఏటా రూ.25కోట్లకు పైగానే టర్నోవర్
- రూ.100 కోట్ల విలువైన ఆస్తులను సంరక్షించాం
- రైతుసేవా కేంద్రాలతో బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాము
- 3.10 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- టీంవర్క్‌తోనే రాష్ట్రంలో నంబర్‌వన్ స్థానానికి..
- డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్


డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 12: నష్టాల ఊబిలో నుంచి తెలంగాణలో నంబర్‌వన్ స్థానానికి చేరడం వెనుక టీంవర్క్ దోహదం చేసిందని డీసీఎంఎస్ (జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ)చైర్మన్ మల్కాపురం శివకుమార్ అన్నారు. ఈ నెల 28తో డీసీఎంఎస్ పాలకవర్గం గడువు ముగుస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా విస్తరించిన ఈ సొసైటీని ఐదేళ్లలోనే అగ్రస్థాయిలో నిలబెట్టామనే సంతృప్తి మరువలేనిదని ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. డైరెక్టర్లు, సొసైటీల చైర్మన్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు, అధికారులు, సేవాకేంద్రాల నిర్వాహకుల కృషి ఉందన్నారు.

లాభాల బాట పట్టడానికి ఎలా ముందుకెళ్లారు?

2020 ఫిబ్రవరి 29న బాధ్యతలు చేపట్టిన సమయంలో సొంతంగా మాకు కార్యాలయం కూడా లేదు. జిల్లా సొసైటీ అప్పటికే రూ.12లక్షల నష్టాల్లో ఉంది. ముందుకు తీసుకెళ్లడానికి అనేక ఆలోచనలు చేశాం. డీసీఎంఎస్ సంస్థపై రైతుల్లో విశ్వసనీయత, నమ్మకం కలిగేలా చర్యలు చేపట్టాం. రైతుసేవా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాం. 50 కేంద్రాల ద్వారా ధాన్యం, మక్కలు, సోయా, కందులు కొనుగోలు చేశాం.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డీసీఎంఎస్‌ను రైతులు విశ్వసిస్తున్నారా?


నేను బాధ్యతలు చేపట్టాక మొదటి ఏడాదిలోనే రూ.23లక్షల లాభం రాగా ప్రస్తుతం రూ.కోటికి చేరువైంది. 2020-21లో ఉమ్మడి మెదక్ జిల్లాలో 15,228 మంది రైతులకు విత్తనాలు, ఎరువులు అందించగా.. ఐదేళ్లలో ఆ సంఖ్య 1.29 లక్షలకు చేరిందంటే రైతులకు నమ్మకం కలిగించడంతోనే సాధ్యమైంది. ఐదేళ్ల వ్యవధిలో 2.88 లక్షల మంది రైతులకు దశలవారీగా విత్తనాలు, ఎరువులను రైతు సేవాకేంద్రాల ద్వారా తక్కువ ధరకు విక్రయించడం జరిగింది. 37,415 మంది రైతుల వద్ద 18లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోలు చేశాం. ఇంతకన్నా సక్సెస్ ఏముంటుంది.

ఆదాయాన్ని ఎలా వినియోగిస్తున్నారు?

ఐదేళ్ల వ్యవధిలో దాదాపు రూ.10 కోట్ల వరకు డీసీఎంఎస్‌కు ఆదాయం సమకూరేలా కృషిచేశాం. ప్రతీఏటా విత్తనాలు, ఎరువులు, ఇతర క్రయవిక్రయాల ద్వారా రూ.20కోట్లకు పైగానే టర్నోవర్ జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారు రూ.100 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో పరిరక్షించాం. జహీరాబాద్‌లో ఫార్మర్ సర్వీస్ సెంటర్‌ను నిర్మిస్తున్నాం. డీసీఎంఎస్ స్థలంలో భారీ కాంప్లెక్స్‌ను నిర్మించి అద్దెల ద్వారా శాశ్వత ఆదాయాన్ని సమకూర్చుతున్నాం. ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా పారదర్శకంగా లావాదేవీలు కొనసాగాయి.

అనుభవం లేకున్నా ఐదేళ్లపాటు చైర్మన్‌గా కొనసాగడంపై?

నేను సినిమా, వ్యాపార రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చాను. మొదటిసారి డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాను. 'సీ' గ్రేడ్‌లో ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాను 'ఏ' గ్రేడ్‌కు చేర్చి తెలంగాణలోనే తొలి స్థానాన్ని దక్కించుకున్నాం. కొన్ని మార్కెటింగ్ స్కిల్స్‌ను వినియోగించడంతోపాటు బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టి రైతులకు మేలుచేశాననే తృప్తిగా ఉంది. అప్పుడు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు సహకారం నన్ను మరింత ముందుకు నడిపించింది. అనుభవం కంటే ఆలోచనా విధానం, రైతులకు సేవచేయాలనే పట్టుదల ఉన్నందునే ఐదేళ్లపాటు ఆదర్శంగా తీర్చిదిద్దాను.



అనుమతితో కొన్ని.. అక్రమంగా మరిన్ని!

ఇటీవల మున్సిపాలిటీల్లో విలీనమైన హైదరాబాద్ శివార్లలో ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉన్న పూర్వ గ్రామ పంచాయతీల్లో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో బిల్డర్లు రెండంతస్తులకు అనుమతులు తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. గతంలో పంచాయతీ పాలనలో ఉండగా సిబ్బంది కొరత, పర్యవేక్షణకు ప్రత్యేక విభాగాలు లేకపోవడం తదితర కారణాలతో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు జరిగేవి. మున్సిపాలిటీలో విలీనం తరువాత నిర్మాణాలపై పర్యవేక్షణ పెరుగుతుందని భావించినా అదేమీ జరగలేదు. మున్సిపాలిటీల్లో నిర్మాణాలను పర్యవేక్షించడానికి టౌన్‌ప్లానింగ్ విభాగమున్నా ఎలాంటి మెరుగైన ఫలితాలు రావడం లేదు. అక్రమ కట్టడాలను నియంత్రించడంపై శ్రద్ధ చూపని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పరోక్షంగా అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

- విలీన గ్రామాల్లో పాత పంచాయతీ అనుమతులతో నిర్మాణాలు
- అనుమతికి మించి అంతస్థులు
- నోటీసులతో సరిపెడుతున్న టౌన్‌ప్లానింగ్ విభాగం
- మూడు మున్సిపాలిటీలకు ఒకే టీపీవో

అమీన్‌పూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనమైన కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, ఐలాపూర్, సుల్తాన్‌పూర్ తదితర గ్రామాలు ఔటర్‌రింగ్ రోడ్డును ఆనుకునే ఉంటాయి. ఆయా గ్రామాల్లో అపార్ట్‌మెంట్‌లు నిర్మించేందుకు బిల్డర్లు ఉత్సాహం చూపిస్తున్నారు. మధ్య తరగతి వర్గాలకు అపార్ట్‌మెంట్ కావాలంటే కిష్టారెడ్డిపేట కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గతంలో పంచాయతీ పాలనలో జీ ప్లస్ 2 అంతస్థులకు మాత్రమే ఈవోలు అనుమతులు ఇచ్చేవారు. మరో రెండు అంతస్థులు అక్రమంగా నిర్మించి బిల్డర్లు తక్కువ ధరకు వినియోగదారులకు అంటగట్టే వారు. మున్సిపాలిటీలో విలీనంతో జీ ప్లస్-2 అనుమతులను తీసుకున్న నిర్మాణాలపై అక్రమ అంతస్థులు వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారని భావించారు. కానీ, అదేమీ జరగలేదు. గతంలో పంచాయతీ ఇచ్చిన అనుమతులతోనే బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపాలిటీలో విలీనం చేసిన సమయంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కిష్టారెడ్డిపేటలో హంగామా సృష్టించారు. పదుల సంఖ్యలో నిర్మాణంలో ఉన్న కట్టడాలకు, అపార్ట్‌మెంట్లకు నోటీసులు జారీ చేశారు. అదే సమయంలో హైడ్రా కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో పెద్దఎత్తున నిర్మాణాలు కూల్చివేయడంతో మున్సిపల్ నోటీసులు చర్చనీయాంశంగా మారాయి. కానీ, నెలలు గడుస్తున్నా అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగలేదు. కొందరు బిల్డర్లు మున్సిపాలిటీలో విలీనంపై ప్రచారం మొదలవగానే ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున పంచాయతీ అనుమతులు తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్న కట్టడాల యజమానులు పంచాయతీ ప్రొసీడింగ్‌లను చూపిస్తున్నారు.

అక్రమ అంతస్థుల క్రమబద్ధీకరణ జరిగేనా?

అనుమతులు లేకుండా నిర్మించిన అదనపు అంతస్థుల్లోని ప్లాట్లకు గతంలో దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేసేవారు. వాటిని కొనుగోలు చేసిన ప్లాట్ల యజమానులు మ్యూటేషన్ చేయించుకునేందుకు ఇబ్బందులు పడేవారు. అనుమతిలేని అంతస్థుల్లోని ప్లాట్లకు నిబంధనలను తుంగలోతొక్కి దొడ్డిదారిన సేల్‌డీడ్‌లు చేయడంపై విమర్శలు రావడంతో ఆయా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో, అక్రమ

మిగతా 8వ పేజీలో..

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు రూ.130 కోట్లు

విద్యుత్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నందకుమార్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కరెంటు సరఫరాలో వచ్చే సమస్యలను అధిగమించేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ 2024-25 కింద సంగారెడ్డి జిల్లా విద్యుత్ శాఖకు రూ.130 కోట్లు కేటాయించిట్లు విద్యుత్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నందకుమార్ తెలిపారు. సంగారెడ్డిలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో బుధవారం ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశమయ్యారు. వేసవిలో కరెంట్ సరఫరాకు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 11 కేవీ, 33 కేవీ లైన్ల మరమ్మతులు, కొత్తలైన్‌లు వేయడం తదితర పనులకు ఈ నిధులు కేటాయిస్తామన్నారు. ఆయా పనులను ఈ నెలలోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీనాథ్, డీఈ సురేందర్‌రెడ్డి, ఏడీఈ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

33 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

ఎన్నికల శిక్షణకు గైర్హాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణకు హాజరుకాని 33 మంది ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 9 వ తేదీన సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, వివిధ శాఖల నుంచి ఎన్నికల విధులు అప్పగించిన 33 మంది ఉద్యోగుల గైర్హాజరు కావడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని డీఈవో వెల్లడించారు.

కళతప్పిన 'కుష్కిరాలు'

- తూప్రాన్ పట్టణ పరిధిలో ఊరున్నా.. వసతులకు దూరం
- మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధుల శీతకన్ను
- సౌకర్యాలు లేక ఒక్కొక్కొక్కరుగా ఊరిని వీడిన జనం
- నాడు 20 కుటుంబాలు.. నేడు ఒకే కుటుంబం


కుష్కిరాలు గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న గృహాలు

7లో

డంపుయార్డు మాకొద్దు

- కొనసాగుతున్న నిరసనలు
- వేరే చోటుకు మార్చాలని కలెక్టర్‌కు దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ కమాండర్ లేఖ


తహసీల్దార్ కార్యాలయం వద్ద గొర్రెలతో రైతుల నిరసన

8లో

స్థానిక ఎన్నికలకు పోలీసుశాఖ సిద్ధం

- ప్రశాంత ఎన్నికలకు ప్రత్యేక ప్రణాళిక
- పాత నేరస్థుల బైండోవర్
- సంగారెడ్డి ఎస్పీ రూపేష్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పోలీసు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు అధికారులంతా ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని తెలిపారు. గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించినవారిని ముందస్తుగా బైండోవర్ చేయాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ రోజు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండాల్సిన కనీస వసతులను కల్పించాలని పేర్కొన్నారు. డబ్బు, మద్యం, క్రికెట్ కిట్ల పంపిణీ, ఇతర సామగ్రి అక్రమ రవాణా చేయకుండా ముమ్మరంగా తనిఖీలు చేయాలని సూచించారు. పార్టీలను, వ్యక్తులను కించపర్చేలా పోస్టులు పెట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సమాచారాన్ని సేకరించాలని నిర్దేలవించారు. పోలీసు అధికారులు, సిబ్బంది 24/7 హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని, వెంటనే త్వరితగతిన స్పందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

జహీరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ పకడ్బందీగా సేవలందించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలందించడంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆస్పత్రిలో ఇబ్బందులుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యవిధానపరిషత్ సంచాలకులు సంగారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జహీరాబద్‌లోని ప్రభుత్వాస్పత్రిని పరిశీలించి డాక్టర్లతో మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

ఏసీబీకి చిక్కిన దుబ్బాక ఆర్‌ఐ

భూ వారసత్వ మార్పిడికి రూ. లక్ష డిమాండ్

దుబ్బాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ఆర్‌ఐ బుధవారం సాయంత్రం ఏసీబీకి పట్టుపడ్డారు. భూమి బదలాయింపు కోసం దుబ్బాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మన్యం నర్సింహారెడ్డి బుధవారం సాయంత్రం సిద్దిపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద ఓ టీపాయింట్‌లో రూ.లక్ష లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ కథనం ప్రకారం.. దుబ్బాక మండలం అప్పనపల్లికి చెందిన కుంభం రాజిరెడ్డికి సర్వే నెంబరు 257, 259, 266, 275, 287లో సుమారు మూడు ఎకరాల 25గుంటల భూమి ఉంది. ఇటీవల ఆయన కన్నుమూయడంతో వారసత్వంగా భార్య సుజాత తన పేరిట భూమి బదలాయించాలని దుబ్బాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డిని ఆశ్రయించింది. ఆయన రూ.50 వేలు లంచం డిమాండ్ చేయడంతో ఆమె ఏసీబీని ఆశ్రయించారు. లంచం ఇచ్చేందుకు సుజాతను దుబ్బాకకు రావాల్సిందిగా నర్సింహారెడ్డి సూచించాడు. అక్కడ మరో రూ.50 వేలు కావాలని డిమాండ్ చేశాడు. రూ.లక్ష తీసుకుని సాయంత్రం లోగా సిద్దిపేటకు రావాలని చెప్పాడు. బుధవారం సాయంత్రం సిద్దిపేటలో టీపాయింట్ వద్ద బాధితురాలు రూ.లక్ష ఆర్‌ఐ నర్సింహారెడ్డికి అందించగానే ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని, ఆయనను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి రికార్డులను తనిఖీ చేశారు.

ప్రాణాలు పోసే వైద్య సిబ్బంది.. పస్తులుండాలా?

- ఏడు నెలలుగా జీతాలు బకాయి
- ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- మెదక్ జిల్లాలో 32 మంది



మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు రాక పస్తులుండే పరిస్థితి వచ్చింది. ఏడు నెలల క్రితం వైద్య విధాన పరిషత్ నుంచి మెడికల్ కళాశాల పరిధిలోకి ఉద్యోగులను మార్చుతున్నట్టు నివేదికలు సిద్ధం చేసి పంపారు. కానీ, వైద్య కళాశాల పరిదిలోకి మార్చినట్టు అధికారులు చెపుతున్నా అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదని అధికారులు చెపుతున్నారు. దీనిపై ఎన్నోసార్లు హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్న తమకు అవికూడా సమయానికి రాకపోవడంతో ఏడు నెలలుగా అప్పులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నామని వాపోతున్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతిపత్రాలు కూడా ఇచ్చినా పరిష్కారం లభించలేదని అంటున్నారు.

ఉద్యోగుల వివరాలు..

వైద్యులు -8, స్టాఫ్ నర్స్-6, ల్యాబ్ టెక్నీషియన్ 1, ఎక్స్‌రే టెక్నీషియన్ -1, వెంటిలేటర్ టెక్నీషియన్-1, ఎమ్మెన్వో-6, ఎఫ్ఎన్వో -2 సెక్యూరిటీ-3, బ్లడ్ బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్-2, స్టాఫ్ నర్స్-2, డాటాఎంట్రీ ఆపరేటర్ -1, ల్యాబ్ అటెండర్ -1 ఉన్నారు.

జీతాలు రాక పస్తులుండే పరిస్థితి



ఏడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందిపడుతున్నాం. వైద్య ఆరోగ్యశాఖ నుంచి వైద్యకళాశాలకు మారుస్తున్నట్టు ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రక్రియ పూర్తికాలేదని, అందుకే జీతాలు రావడం లేదని అధికారులు అంటున్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది.

-శివ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్

గుర్తింపు లేదు.. జీతాలు రావు



కరోనా లాంటి కష్ట సమయాల్లో రోగులకు సేవలు అందించినా తమకు గుర్తింపు లేదు. కనీసం నెల నెలా జీతం రాక అవస్థలు ఎదుర్కొంటున్నాం. హైదరాబాద్‌లోని కార్యాలయాల చుటూ తిరిగినా సమస్య పరిష్కారం కావడంలేదు.

-పద్మ, స్టాఫ్‌నర్స్

బెల్టుషాపుపై పోలీసుల దాడి

● రూ. 55 వేల విలువైన బీరు, మద్యం బాటిళ్లు స్వాధీనం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇబ్రహీంనగర్‌లో ఓ బెల్టుషాపుపై పోలీసులు దాడి చేసి బీరు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన పంతం లక్ష్మీనారాయణ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే నమ్మదగిన సమాచారంతో బుధవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు బెల్టుషాపుపై దాడి చేశారు. రూ.55 వేల విలువ గల 206 లీటర్ల బీరు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మృతదేహంతో రోడ్డుపై ఆందోళన చేపట్టిన గ్రామస్థులు


గామ ఐలయ్య(ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు వివరాల ప్రకారం.. మండలంలోని వీరానగర్ గ్రామానికి చెందిన జాలి గామ ఐలయ్య ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిమెంటు బస్తాల కోసం ఐలయ్య బుధవారం అంకిరెడ్డిపల్లి వద్ద ఉన్న సిమెంటు దుకాణానికి వచ్చాడు. ఆటోను దుకాణం వద్ద నిలిపి రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఐలయ్యను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, వీరానగర్ గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని గజ్వేల్-చేగుంట రహదారిపై బైఠాయించారు. తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్ఐ రఘుపతి అక్కడికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కంటైనర్ లారీ బైక్‌ను ఢీకొనడంతో మరొకరు..

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం తునికిమక్త గ్రామానికి చెందిన పసుల స్వామి(48) తన బైక్‌పై వర్గల్ కమాన్ చౌరస్తా నుంచి తూప్రాన్ రోడ్డు వైపు మలుపు తిరుగుతున్నాడు. ఇదే సమయంలో ప్రజ్ఞాపూర్ నుంచి తూప్రాన్ రోడ్డు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ బైక్‌పై వెళ్తున్న స్వామిని వెనుక నుంచి ఢీకొన్నది. స్వామి కిందపడిపోగా లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీడ్రైవర్ అక్కడి నుంచి పారిపోవడంతో 2 గంటల పాటు కంటైనర్ లారీ రోడ్డుపైనే నిలిచిపోయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి, కంటైనర్ లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొట్టిన లారీ

- ఎద్దు మృతి, మరో ఎద్దుకు విరిగిన కాలు
- ముగ్గురికి గాయాలు

కోహీర్, ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండిని లారీ ఢీకొనడంతో ఒక ఎద్దు మృతిచెందగా, మరో ఎద్దు కాలు విరగడంతో పాటు బండిలో ఉన్న ముగ్గురికి గాయాలైన సంఘటన కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు బ్యాగారి ఝర్నప్ప అతని కుమారులు నరేష్, రాకేష్ మంగళవారం రాత్రి తమ వ్యవసాయ పొలం వద్ద చెరుకు పంటకు నీటిని అందించి బుధవారం తెల్లవారుజామున తమ ఎడ్లబడండిపై ఇంటికి బయలుదేరారు. బిలాల్‌పూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారి వెంబడి ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఎడ్లబండిని ఢీకొన్నది. దీంతో ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఎద్దు కాలు విరిగింది. ఎండ్లబండిలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. లారీని ఆపకుండా పారిపోయాడు. ఈ మేరకు కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి బాలిక మృతి


జుబేరియా మృతదేహం

తూప్రాన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తల్లి చెరువులో దుస్తులను ఉతుకుతుండగా కూతురు పక్కనే ఆడుకుంటూ చెరువులో మునిగి మృతిచెందింది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మహ్మద్ చాంద్‌పాష, పర్వీన్ దంపతులకు ఇద్దరు పిల్లలు. బుధవారం పెద్దచెరువులో దుస్తులు ఉతికేందుకు పర్వీన్ తన కూతురు మహ్మద్ జుబేరియా(6)తో వెళ్లింది. పెద్దచెరువులో బతుకమ్మఘాట్ వద్ద తల్లి దుస్తులను ఉతుకుతుండగా, బతుకమ్మ ఘాట్ మెట్లపై జుబేరియా ఆడుకుంటుంది. జుబేరియా చెరువులోని నీటిలోకి వెళ్లి మునిగిపోగా, తల్లి గమనించలేదు. కొంత సమయానికి పర్వీన్ చూడగా జుబేరియా కనిపించకపోవడంతో కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వెతకగా చెరువులో మునిగి కనిపించింది. వెంటనే వెలికితీసి తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి


లస్మయ్య (ఫైల్)

హవేళిఘణపూర్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజిరేటకు చెందిన బత్తుల లస్మయ్య(60) చేపలు పడుతూ కొడుకుతో కలిసి జీవించేవాడు. ఇంట్లో వారు ఈనెల 10న హైదరాబాద్‌కు చిన్నకుమారుడి వద్దకు వెళ్లారు. లస్మయ్య ఒక్కడే ఇంటివద్ద ఉన్నాడు. మంగళవారం గ్రామ శివారులోని గంగమ్మ వాగుకు లస్మయ్య చేపలవేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి కుమారుడు భీమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

కాళ్లకల్‌లో ఇల్లు దగ్ధం

- 3 తులాల బంగారం, రూ.35 వేలు అగ్నికి ఆహుతి


కాలిపోయిన నోట్లు

మనోహరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మనోహరాబాద్ మండల పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో 35 సంవత్సరాలుగా బిహార్ రాష్ట్రానికి చెందిన మిథిలేష్ చౌహన్, లీలాదేవి దంపతులు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో మంటలు చేలరేగి ఇల్లు దగ్ధమైంది. విషయం తెలియగా చౌహన్ ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉన్న సుమారు 3 తులాల బంగారం, రూ.35 వేల నోట్లు, పిల్లల పుస్తకాలు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. కాగా, దంపతుల ఇద్దరికి మంగళవారమే జీతాలు రాగా, ఆ డబ్బు మొత్తం ఇంట్లో పెట్టడంతో కాలిపోయింది.

మంటలు చెలరేగి ఆటో..


కాలిపోతున్న ఆటో

మనోహరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటోలో మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన బుధవారం కాళ్లకల్ వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకున్నది. తూప్రాన్ నుంచి మేడ్చల్ వైపు వెళ్తతున్న బొలేరో ఆటో వాహనం కాళ్లకల్ జనతా హోటల్ వద్దకు రాగానే మంటలు రావడంతో గమనించిన డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కనే నిలిపాడు. వెంటనే దిగడంతో డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. రోడ్డుపై ఆటో మంటల్లో కాలి దగ్ధమైంది.


తూప్రాన్ పట్టణ పరిధిలోని కుష్కిరాలు ప్రాంతం

కళతప్పిన 'కుష్కిరాలు'

తూప్రాన్ శివారులోని ఊరైనా వసతులకు దూరం

మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధుల శీతకన్ను

సౌకర్యాలు లేక ఒక్కొక్కొక్కరుగా వీడిన ఊరు

నాడు 20 కుటుంబాలు.. నేడు ఒకే కుటుంబం

తూప్రాన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అక్కడి ఇళ్లకు ఇంటి నంబర్లే లేవు.. ఇక సౌకర్యాల మాట దెవుడెరుగు.. ఒకప్పుడు 20 ఇళ్లతో కళకళలాడిన ప్రాంతం కాస్త ఎలాంటి వసతుల కల్పనకు నోచుకోక ఒక్కొక్కరుగా ఊరును వదలడంతో ఒకే ఒక కుటుంబం మిగిలింది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న పరిస్థితి అనుకుంటే పొరపడినట్లే.. తూప్రాన్ పట్టణ పరిధిలోని ఓ ఊరుకు పట్టిన గ్రహణమిది. అదే వందల ఏళ్ల క్రితం నుంచి ఉన్న ఊరు నిరాదరణకు గురై కాలగర్భం కలసిపోతున్న 'కుష్కిరాలు'.


కుష్కిరాలుకు వెళ్లేందుకు ఉన్న ఏకైన పానాధి దారి

తూప్రాన్ పట్టణానికి తూర్పు దిక్కున పురాతన రామాలయం సమీపంలో కుష్కిరాలు ఊరుంది. వందల ఏళ్ల క్రితం ముస్లిం కుటుంబాలు కొన్ని పొలాల వద్ద ఇళ్లను నిర్మించుకుని నివసించారు. 20 కుటుంబాలు వరకు ఉండేవి. పేరుకు కుష్కిరాలు ఊరే కానీ వసతుల పరంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. మేజర్ గ్రామ పంచాయతీగా తూప్రాన్ కొనసాగిన కాలంలోనే కుష్కిరాలలోని ఇళ్లకు ఇంటి నంబర్లు, దశబ్ధాన్నర క్రితమే తాగునీటి వసతి కల్పించేందుకు వాటర్ ట్యాంకు నిర్మించారు. కానీ ఇతర సౌకర్యాలు ఏవీ సమకూర్చకపోవడంతో ఒక్కొక్క కుటుంబం కుష్కిరాలను వీడారు. తూప్రాన్ పట్టణంలోకి వచ్చి నివాసముంటున్నారు. ప్రస్తుతం కుష్కిరాలలో ఇళ్లు కూలిపోయి శిథిలావస్థకు చేరుకున్నారు. ప్రస్తుతం ఊర్లో సాధక్ అలీ కుటుంబం ఒక్కటే నివసిస్తుంది. తూప్రాన్ మేజర్ గ్రామ పంచాయతీ 2018లో మున్సిపాలిటీగా ఏర్పాటయ్యింది. నాటి నుంచి కుష్కిరాలపై పాలకులు శీతకన్ను వేశారు. మున్సిపాలిటీగా ఏర్పాటైనప్పటికీ ఎలాంటి వసతులు సమకూర్చకపోగా, ఉన్న ఇంటి నంబర్లను కూడా తొలగించారు. కుష్కిరాలకు ఉన్న పానాధి తోవను కనీసం మరమ్మతు కూడా చేసిన దాఖలాలు లేవు. ఇక్కడికి పొలాల గట్ల వెంట ప్రమాదకంగా వెళ్లాల్సి వస్తున్నది. ఊర్లో వీధి దీపాలు వేసేందుకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, కనీసం వైర్లు ఏర్పాటు చేయలేదు. వాటర్ ట్యాంకు ఉన్న నీటిని సరఫరా చేసేందుకు మున్సిపల్ సిబ్బంది ఇటు వైపే చూడటంలేదు. అక్కడుండే సాధక్ అలీ కుటుంబమే వాటర్ ట్యాంకు నుంచి మిషన్ భగీరథ నీటిని వదలుకుంటారు. అడవిలో గిరిజన తెగలు ఉన్నట్లుగా పట్టణ పరిధిలో ఉంటున్న కుష్కిరాలు ప్రజలు నివసించడం విడ్డూరం. పట్టణంలో భారీగా విద్యుత్ కాంతులు వెదజల్లేందుకు డివైడర్‌పై విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేసి లైట్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. కానీ, కుష్కిరాలు ఊరుకు వెళ్లే మార్గంలో అక్కడక్కడ కూడా స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయలేదు. రాత్రుల్లో కుష్కిరాలు వెళ్లాంటే భయంగా వెళ్లాల్సిందే. కుష్కిరాలు కు రోడ్డు సౌకర్యం, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు వసతులు కల్పించాలని కోరుతున్నారు.


విద్యుత్ తీగలు, స్ట్రీట్ లైట్ లేని స్తంభం

వదలలేక ఎలాగోల బతుకుతున్నాం



నాకు 80 ఏళ్లకుపైగా ఉంటాయి. గ్రామపంచాయతీలో ఉన్నప్పుడు ఊరు కళకళలాడుతుండేది. ఇన్నేళ్లయిన కుష్కిరాలుకు రోడ్డు లేకుండా పోయింది. రాత్రుళ్ల చీకట్లో ఉంటున్నాం. చివరకు ఇంటి నంబరు కూడా లేకుండా చేశారు. ఎక్కడి పోబుద్ది కాక, ఊరును వదలలేక ఎట్టోగట్ట బతుకుతున్నాం.

- చోటిబీ, సాధక్ అలీ తల్లి

వసతులు కల్పించాలి



కుష్కిరాలు ఊరుగా ఉన్న కనీస వసతులు లేవు. స్ట్రీట్ లైట్లు, రోడ్డు ఏర్పాటు చేయాలి. కుష్కిరాలును ఊరుగా చూడాలి. కనీస వసతులు కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపించాలి. మౌలిక వసతులు కల్పించాలి. అన్నీ వసతులు కల్పిస్తే ఇక్కడే అందరూ ఉండేవారు.

- సలీమా, సాధక్ అలీ భార్య

పుకార్లను నమ్మొద్దు

- గ్రామంలో శాంతి విరబూయాలి
- దుబ్బాక సీఐ శ్రీనివాస్


అవగాహన కల్పిస్తున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్

దుబ్బాక, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, మోతె గ్రామంలో శాంతి విరబూయాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పుకార్ల మోతే' వార్తకు స్పందించారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో విద్యావంతులు, యువకులు ఎక్కువగా ఉన్నారని, అంతా కలిసి సమష్టిగా గ్రామాబివృద్ధికి నడుంబిగించాలని సూచించారు. మానవత్వపు కోవేలగా వెలిగిన మోతే వెలగొందలన్నారు. నల్లపోచమ్మ, వెంకటేశ్వరస్వామి, రామలింగేశ్వరుడు, దర్గా, ప్రార్థన మందిరాలన్నీ మానవత్వాన్నే ప్రబోధిస్తాయని తెలిపారు. అందరి విశ్వాసాలను గౌరవించాలని, మూఢవిశ్వాసాలను పారదోలలని కోరారు. గ్రామంలో కక్షలకు కార్పాణ్యాలకు తావివ్వద్దన్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనం సామాజిక చైతన్యాన్ని స్ఫురిస్తుందన్నారు. పత్రికలు గ్రామాల్లో చైతన్య దీపికలన్నారు. గ్రామంలో ఎవరికి ఏ అపోహలున్నా తమను సంప్రదించాలని, నివృత్తి చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఆయన వెంట భూంపల్లి- అక్బర్‌పేట ఎస్ఐ హరీష్ తదితరులున్నారు.

కొమురవెల్లిలో సత్రం నిర్మాణానికి సాయిల్ టెస్ట్

చేర్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిధిలో డోనర్ స్కీం ద్వారా 100 గదుల సత్రం భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలంలో బుధవారం జియాలజిస్టు, దేవాదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులు సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిధిలోని నిత్యాన్నదానసత్ర భవన సమీపంలో సాయిల్ టెస్ట్ నిర్వహించారు. స్థలం సామర్థ్యం పరీక్షల అనంతరం భవన ప్లాన్, మ్యాపులతో నివేదిక రూపొందిస్తామని, కమిషనర్ ఆమోదంతో పనులు చేపడతామని ఈవో రామాంజనేయులు తెలిపారు. ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఇంజనీరింగ్ ఏఈ సతీశ్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

- ప్రేమ పెళ్లికి నిరాకరించిన మెదినీపూర్‌లో యువకుడు
- వడియారంలో పురుగుల మందు తాగి మరో యువకుడు..
- కడుపునొప్పి భరించలేక చల్మెడలో మహిళ బలవన్మరణం

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయితో వివాహం చేయడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుకునూరుపల్లి మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మెదినీపూర్ గ్రామానికి చెందిన గడ్డం గణేష్(22) తన ప్రేమ విషయాన్ని కొన్నాళ్ల క్రితం ఇంట్లో చెప్పాడు. ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని తెలపగా కుటుంబసభ్యులు నిరాకరించారు. మేన మరదలుతో గణేష్ పెళ్లి చేయడానికి నిర్ణయించుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన గణేష్ మంగళవారం రాత్రి ఫోన్ మాట్లాడుతూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లి అర్ధ రాత్రి బయటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మద్యం తాగొద్దని మందలించడంతో..

చేగుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగొద్దని కొడుకును తండ్రి మందలించడంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండలం వడియారంలో బుధవారం చోటుచేసుకున్నది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గనబోయిన శివకుమార్ అలియాస్ శివుడు (30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ చేయడంతో తండ్రి చంద్రయ్య కొడుకు శివకుమార్‌ను మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన శివకుమార్ మంగళవారం రాత్రి గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో పురుగుమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు శివకుమార్‌ను నార్సింగ్ ఆసుపత్రికి తరలించారు. బుధవారం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. శివకుమార్‌కు భార్య దీప, కొడుకు హర్షవర్ధన్, కూతురు రిత్విక ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఉరేసుకుని మహిళ

నిజాంపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండలం పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన సంగోళ్ల వినోద(32) రెండు నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతుంది. నొప్పిని భరించలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వినోద అత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పరారీలో ముగ్గురు అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12: మెదక్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సంజీవ్ ఆత్మహత్య కేసులో కీలక వీడియోతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీంతో సంజీవ్‌ను వేధించిన ముగ్గురు అధికారులు పరారీలో ఉన్నట్లు సమాచారం. వారు యాంటిస్పెటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వీడియో ఆధారంగా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఎస్ఐ మల్లిఖార్జున్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రాజశేఖర్‌ను పోలీసులు రెండు రోజుల క్రితం విచారించారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశామని, విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ విషయంలో కల్పించుకున్న పట్టణంలోని నేతలు సంజీవ్ కుటుంబానికి అండగా ఉంటామని, మృతుడి స్థానంలో అతని కుమారుడికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా అవకాశం కల్పించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. అంతేగాకుండా వేధింపులకు గురి చేసిన అధికారుల నుంచి ఆర్థిక సహాయం అందేలా మాట్లాడినట్లు తెలిసింది. ముగ్గురు అధికారులను అరెస్ట్ చేయాలని సంజీవ్ కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ కేసులో సంజీవ్ ఆత్మహత్యకు ముందు సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసిన వీడియోసందేశం కీలకంగా మారింది. దీని ఆధారంగానే ముగ్గురు అధికారుల వేధింపుల విషయం వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో ఉన్న కీలకాంశాలు.. 'సార్ నేను చనిపోవడానికి కారణం ఒకటవది హెల్త్ అసిస్టెంట్ మహేష్.. రెండవది కుమ్మరి రాజశేఖర్.. మూడోది ఎస్ఐ.. ఈ ముగ్గురు నా చావుకు కారణమైతుండ్రు. నన్ను లంచం అడిగిండ్రు.. ఇయ్యలేక పోయిన.. నన్ను ఇబ్బంది పెట్టి డంపింగ్‌యార్డులో వేసి చెత్త తీపించారు వీళ్లు.. నేను వీళ్ల కోసం చచ్చిపోతే దయచేసి నా ఉద్యోగం నా కొడుక్కు ఇవ్వగలరని కలెక్టర్‌కు నమస్కరించుకుంటున్నా' అని ఉంది.

మట్టి తరలింపు కేసులో ఇద్దరి బైండోవర్

మనోహరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలింపు కేసులో ఇద్దరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మనోహరాబాద్ మండల పరిధి కూచారానికి ఇద్దరు మట్టి దందా చేస్తున్నారు. ఆదివారం అక్రమంగా మట్టిని తరలిస్తుండుగా అదే గ్రామానికి చెందిన మజ్జతీ ఆనంద్ అడ్డుకున్నాడు. దీంతో ఇరు వర్గాల మధ్య గోడవ జరిగింది. ఆనంద్‌పై దాడి చేయగా అతడి చేయికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆనంద్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నాలుగు టిప్పర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. మజ్జతి ఆనంద్ ఫిర్యాదు మేరకు అతడిపై దాడి చేసిన అంజనేయులు, గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. అలాగే, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఎదుట వారిని బైండోవర్ చేశారు.

కోహీర్‌లో ఓ ఇంట్లో చోరీ

- 10 తులాల వెండి, తులం బంగారం, పదివేల నగదును దోచుకెళ్లిన దుండగులు


బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

కోహీర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ పట్టణంలోని ఓ ఇంట్లో చోరి జరిగిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల మేరకు.. కోహీర్‌కు చెందిన శంభునిసిద్ధన్న తన కుటుంబ సభ్యులతో కలిసి 10 రోజుల క్రితం ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లారు. అక్కడి నుంచి మంగళవారం రాత్రి ఇంటికి తిరిగొచ్చారు. ఇంటిక వచ్చి చూసేసరికి ఇల్లు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా, బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న బట్టలు చిందరవందరగా పడేసి కనిపించాయి. బీరువాలో దాచిన పది తులాల వెండితో పాటు తులం బంగారం, రూ.10 వేలు దొంగతనం అయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కోహీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అత్యాచారయత్నం కేసులో దోషికి మూడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో దోషికి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా సెషన్స్ పోక్సో కోర్టు న్యాయాధికారి కె.జయంతి బుధవారం తీర్పు చెప్పారు. ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.... కోహీర్ మండలం మనియార్ పల్లి గ్రామానికి చెందిన బాలిక(17)పై వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రానికి చెందిన బేగరి ఆంజనేయులు(19) 20211 జనవరి 1న అత్యాచార యత్నం చేశాడు. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో దోషి అయిన ఆంజనేయులుకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.సూర్‌రెడ్డి వాదించారు.

హత్య కేసులో జీవిత ఖైదు

రామచంద్రాపురం టౌన్ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తమ్ముడిని హత్య చేసిన సంఘటనలో అన్నకు జీవిత ఖైదు విధించిన సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాలు ప్రకారం.. అన్నదమ్ములు ఎండి లతీఫ్(24), ఎండి ఇబ్రహీం రామచంద్రాపురం బోంబేకాలనీలో నివాసం ఉంటున్నారు. ఇద్దరి మధ్య కుటుంబ తగాదాలు ఉన్నాయి. 2020 జనవరి 17న ఎండి లతీఫ్‌ను అన్న ఇబ్రహీం రాత్రి నిద్రపోతున్న సమయంలో గొడ్డలితో నరికి హత్య చేశారు. మృతదేహాన్ని స్నేహితుడు ఎర్రోళ్ల అశోక్ సహకారంతో భారతీనగర్ డివిజన్ పరిధి మ్యాక్‌సొసైటీ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్‌కు వెళ్లే దారిలో నిర్మానుష్యమైన ప్రాంతంలో తగులబెట్టారు. గతంలో పని చేసిన సీఐ రమేష్, జగదీష్ విచారణ జరిపి ఇబ్రహీంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి భవానిచంద్ర ఇబ్రహీంకు జీవితఖైదు విధించి రూ.3వందలు జరిమానా వేస్తూ తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా సహకరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ, కోర్టు కానిస్టేబుళ్లు కాశీనాద్, సుమన్, మహేందర్‌ను సీఐ అభినందించారు.



ప్రతిష్ఠోత్సవానికి ఐడీఏ బొల్లారం
జగన్నాథ ఆలయం ముస్తాబు

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో అనుబంధంగా ఆరు రకాల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 14 నుంచి 18 వ తేదీ వరకు రోజువారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆంజనేయస్వామి, లక్ష్మీదేవి, వినాయకుడు, శివాలయం, దర్గాదేవి, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అమీన్‌పూర్ పెద్దచెరువులో అభిషేకించి అనంతరం అక్కడి నుంచి ఆలయం వరకు విగ్రహాలతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు పెద్దఎత్తున హాజరుకానున్నారని ఆలయ కమిటీ తెలిపింది. ఒడిశా పూరీ జగన్నాథస్వామి ఆలయానికి చెందిన 19 మంది వేదపండితుల సమక్షంలో విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

కంగ్టి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను బుధవారం విడుదల చేసినట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. 12 ఎంపీటీసీ స్థానాల పరిధిలో మొత్తం 36,310 మంది ఓటర్లు ఉండగా మొత్తం 70 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సగటున 514 మంది ఓటర్లకు ఒక కేంద్రం చొప్పున ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిపై నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విలీన గ్రామాలు వార్డుల్లో సర్దుబాటు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 12 : తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనమైన పాటి, కర్దనూర్, ఘనపూర్, ముత్తంగి, పోచారం గ్రామాలను తెల్లాపూర్ మున్సిపాలిటీలోని 17 వార్డుల్లో సర్దుబాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. కొత్తగా గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం చేయడంతో మొత్తం ఓటర్ల సంఖ్య 45 వేలకు చేరిందన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్డుకు 2900 నుంచి 3వేల ఓటర్లకు ఒక వార్డుగా గుర్తిస్తున్నామని చెప్పారు. తెల్లాపూర్ మున్సిపాలిటీని 17 వార్డులుగా సర్దుబాటు చేస్తున్నామని కమిషనర్ చెప్పారు.

కులగణన తప్పుల తడక

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన తప్పుల తడకగా మారిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వేలో పాల్గొన్న సిబ్బందికి ఒక్కొక్కరికీ 150 ఇళ్లను కేటాయించారని, కానీ వారు స్టిక్కర్లు అట్టించిన ఇళ్లకు సర్వే చేసేందుకు వెళ్లలేదని, అర్బన్, మున్సిపల్ నగరాల్లో 50 శాతం కూడా సర్వే చేయలేదని పేర్కొన్నారు. బీసీల సంఖ్యను తక్కువగా చేసి చూపించి తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, విద్యా, ఉద్యోగ రంగాల్లో తమిళనాడు ప్రభుత్వంలా అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో 9వ షెడ్యూల్‌లో చేర్చాలని పేర్కొన్నారు.

గ్యాస్ పరిశ్రమ వద్దే వద్దు

● మద్రి గ్రామస్థులు

కోహీర్, ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ పరిధిలో గ్యాస్ పరిశ్రమ, గ్యాస్ పైప్ లైన్‌ను ఏర్పాటు చేయొద్దని పదే పదే చెబుతున్నా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని మద్రి గ్రామస్థులు వాపోయారు. బుధవారం వారు మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తే పోలీసులు తమను టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఇద్దరిని పోలీస్ స్టేషన్‌కు తరలించగా, అందరం ఆందోళన చేయడంతో విడిచిపెట్టారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్యాస్ పరిశ్రమ, గ్యాస్ పైపులైన్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు.

ఆలిండియా పోటీలకు ఎంపిక

చేగుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు చేగుంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సైని సువర్ణ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు డీడబ్ల్యూవో హైమావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు తమిళనాడులోని చెన్నైలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా రవీందర్‌గుప్తా

తూప్రాన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా తూప్రాన్ పట్టణానికి చెందిన పల్లెర్ల రవీందర్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరేశంగుప్తా పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఖేడ్ విద్యార్థి సత్తా

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మెగావత్ పరశురాం జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటారు. 74.67 పర్సెంటేజ్‌ను సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంగ్టి మండలంలోని మారుమూల గిరిజన తండాకు చెందిన పేద విద్యార్థి పరశురాం జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చడంతో అతడిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

డంపింగ్ యార్డు మాకొద్దు

● కొనసాగుతున్న నిరసనలు
● ఒంటిపై పెట్రోల్ పోసుకున్న యువకుడు
● ఎయిర్‌ఫోర్స్ కమాండర్ కలెక్టర్‌కు లేఖ


గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయం వద్ద గొర్రెలతో నిరసన

గుమ్మడిదల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు వద్దంటూ నిరసనలు కొనసాగుతున్నాయి. డంపుయార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా మండల జేఏసీ కన్వీనర్ చిమ్ముల జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం, రోడ్లపై గొర్రెలను నిలబెట్టి ఆందోళన చేపట్టారు. రిలే నిరాహార దీక్షలో నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు కూర్చున్నారు. ఓ యువకుడు ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఆందోళనల దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

వేరే చోటకు మార్చండి..

ఈ చెత్త డంపింగ్ యార్డు నిర్మాణాన్ని వేరే చోటకు మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని దుండిగల్ ఎయిర్ ఫోర్సు అకాడమీ కమాండర్ కలెక్టర్ వల్లూరు క్రాంతికి లేఖ రాశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ప్రతిపాదిత డంపుయార్డు స్థలం ఇండియన్ ఎయిర్‌ఫోర్సు అకాడమీ ఫ్లయింగ్ జోన్ పరిధిలోకి వస్తుందని, ఇది పక్షులను ఆకర్షించడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతాయని పేర్కొన్నారు.

అనుమతులిచ్చింది బీఆర్ఎస్సే..

నర్సాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్యారానగర్‌లో డంపుయార్డుకు అన్ని విధాల అనుమతులు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లు పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు అబద్ధాలను ప్రచారం చేయడంలో దిట్ట అన్నారు. డంపు యార్డుకు 2015లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టగా, 2022లో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ అన్ని అనుమతులు ఇచ్చారన్నారు. కానీ ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై బురద జల్లే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పుడు అభ్యంతరం చెప్పని సునీతారెడ్డి ఇప్పుడు కాంగ్రెస్‌పై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. డంపింగ్ యార్డుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిసి వివరిస్తామన్నారు.

ఆర్డీవోకు సీపీఎం వినతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో నిర్మించే డంపింగ్ యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు కృష్ణ, అశోక్, దత్తు తదితరులు ఉన్నారు.

ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు : బీజేపీ

● ఆయా మండలాల్లో సన్నాహక సమావేశాలు


వెల్దుర్తి : సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్

వెల్దుర్తి/సంగారెడ్డి అర్బన్/తూప్రాన్/చిన్నశంకరంపేట, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : హామీలిచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ అన్నారు. బుధవారం వెల్దుర్తిలో మండల ముఖ్య నాయకులతో వారు సమావేశమై దిశానిర్దేశం చేశారు. సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు, జిల్లా ప్రబారి శిల్పారెడ్డి హాజరై మాట్లాడారు. తూప్రాన్ హైస్కూల్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిత్తరంజన్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ సభ్యులు బండారు దుర్గరాజ్‌యాదవ్, గజ్వేల్ అసెంబ్లీ ఇన్‌చార్జి సాయిబాబాగౌడ్ పాల్గొని మాట్లాడారు. అలాగే బీజేపీ చిన్నశంకరంపేట మండల అధ్యక్షుడు పోగుల రాజు మండల బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూతూ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిందన్నారు. ఆయా సమావేశాల్లో బీజేపీ జిల్లా, మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి : మెదక్ అదనపు కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఎల్‌పీవోలకు మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాతీయ ఎన్నికల కోసం ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, నియమ నిబంధనలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. మెదక్ జిల్లాలో 492 గ్రామ పంచాయతీల్లో ఎంపీటీసీ స్థానాలు 190, జెడ్పీటీసీ స్థానాలు 21, ఎంపీపీ స్థానాలు 21, సర్పంచ్ స్థానాలు 492, వార్డు సభ్యులు 4,220 ఉన్నారన్నారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా ముందుకుసాగాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేసి మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను చేపట్టాల్సి వస్తుందన్నారు. బ్యాలెట్ పేపర్స్ అభ్యర్థుల పేర్లపై తెలుగు అక్షరమాల క్రమ పద్ధతిలో ముద్రించాల్సి ఉంటుందన్నారు. నోటిఫికేషన్ జారీ నాటి నుంచి ప్రతి రోజు రిపోర్టు అందించాల్సిటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఆర్డీవో శ్రీనివాస రావు, డీఎస్‌వో రాజిరెడ్డి, ఎంపీడీలు, ఎపీవోలు, డీఎల్‌పీవోలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తిపై కేసు

వెల్దుర్తి, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సదాత్‌మియా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వెల్దుర్తి నుంచి ఆరెగూడెం వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కానిస్టేబుల్ సత్యనారాయణ ఆపి పత్రాలు అడిగాడు. ఆ వాహనంపై వెనుక కూర్చున్న ఆరెగూడెం గ్రామానికి చెందిన మాడిగపు జగన్ కానిస్టేబుల్ సత్యనారాయణతో దుర్భాషలాడుతూ చొక్కా పట్టుకొని నెట్టి వేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

వెల్దుర్తి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి) :ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ తెలిపారు. హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేసి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మూడు వాహనాలపై కేసు

రేగోడు ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేని మూడు వాహనాలపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు ఉంచినట్లు ఎస్సై పోచయ్య బుధవారం తెలిపారు. గతంలో పట్టుబడిన ఎస్టిమ్ కారు (ఎంహెచ్ 01 ఎం9747), అంబాసిడర్ కారు (ఎంహెచ్ 11 ఎచ్1778), టాటా ఎస్ (ఏపీ 35 యు2876)లకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ చూపించి తీసుకెళ్లాలన్నారు. వారం రోజుల్లో వాహనాలు తీసుకెళ్లకపోతే వేలం వేస్తామని పేర్కొన్నారు.

సమయపాలన పాటించని టీచర్లపై చర్యలు : డీఈవో


రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో

రేగోడు ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని మెదక్ డీఈవో రాధాకిషన్ హెచ్చరించారు. బుధవారం రేగోడు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. రేగోడు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న సాంకేతిక విద్యపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. టీచర్లు విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రార్థన సమయంలో టీచర్ల ఫొటోలు తీసి పంపాలని సీఆర్‌పీకి సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

● జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

హవేళిఘణపూర్, ఫిబ్రవరి12;(ఆంధ్రజ్యోతి) : రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ తెలిపారు. బుధవారం మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది డాక్టర్ వినయ్, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, మందులు విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి విన్సెంట్ విజయ్

హవేళిఘణపూర్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి); రైతులకు నాణ్యమైన ఎరువులు, మందులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి విన్సెంట్ విజయ్ తెలిపారు. బుధవారం మండలంలోని ఫరీద్‌పూర్, హవేళిఘణపూర్, నాగాపూర్ గ్రామాల ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బ్రహ్మం, ఏఈవో భార్గవ్ ఉన్నారు.

రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య

● బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ప్రతినిధులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని, దాడి చేసిన వీరరాఘవరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య వెస్ట్‌జోన్ అధ్యక్షుడు టీడీవీ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎల్‌కే.రావు, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్‌లు బుధవారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో పురోహితులు, హిందూ ధర్మంపై భౌతిక దాడులు అధికమయ్యాయని, ఇలాగే కొనసాగితే ఆలయాల్లో సేవలందించేందుకు వేదపండితులు వెనుకాడుతారని తెలిపారు. ధార్మిక జీవనాన్ని గడుపుతూ ఆలయంలో దేవుని సేవలో నిమగ్నమైన అర్చకుడిపై దాడికి పాల్పడడం అమానుషమని, ఇలాంటి ఘటనలో తిరిగి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

● మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి


మాట్లాడుతున్న లలితకుమారి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి అన్నారు. బుధవారం బాల్య వివాహాల నిషేధంపై ఖేడ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడ పిల్లలను చదివించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ప్రియాంక, డీసీపీయూ అధికారి రత్నం, ఐకేపీ ఏపీఎం లత వంశీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతితో కొన్ని.. అక్రమంగా మరిన్ని!

(5వ పేజీ తరువాయి)

అంతస్తుల్లోని ప్లాట్ల కొనుగోలుకు ముందస్తుగా నగదు చెల్లించిన బాధితుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అక్రమ అంతస్థుల క్రమబద్ధీకరణకు భవిష్యత్తులో ప్రభుత్వం అవకాశం ఇస్తేనే వారి సమస్య తీరనుంది.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది హవా

అమీన్‌పూర్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది హవా నడుస్తోంది. ఒక్కో ఏరియాకు ఒక్కో సిబ్బందిని నియమించారు. అక్రమ కట్టడాల సమాచారం సేకరించి అధికారులకు అందజేయడమే వారి పని. మున్సిపల్ అధికారులకు బిల్డర్లకు మధ్యవర్తులుగా వారు వ్యవహరిస్తున్నారు. వారి ద్వారానే నోటీసులు జారీ చేయడం, పనులు నిలుపుదల చేయడం, ఒత్తిడి తేవడం తదితర పనులు చక్కబెడుతున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారికి అమీన్‌పూర్‌తో పాటు మరో రెండు మున్సిపాలిటీల బాధ్యతలు అప్పగించడంతో వారానికి రెండు రోజులు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆడిందే ఆటగా చెలరేగిపోతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదు

మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. నోటీసులు జారీ చేసి, చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేని ప్లాట్లను కొనుగోలు చేయొద్దని వినియోగదారులకు సూచిస్తున్నాం. కాలపరిమితి దాటిన పంచాయతీ అనుమతులతో నిర్మాణాలు చేపడితే సహించేది లేదు.

- జ్యోతిరెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్

వైభవంగా శివస్వాముల మహాపడి పూజ



అల్లాదుర్గం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గంలో బుధవారం శివస్వాములు మహాపడి పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్ బసనగారి అనురాధ బలరాం నివాసంలో ఏర్పాటు చేసిన ఈ పూజలో శివస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుస్వామి సదానందం, శివస్వాములు రమేష్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలువుదినంగా ప్రకటించాలి



అల్లాదుర్గం,ఫిబ్రవరి 12. (ఆంధ్రజ్యోతి) : బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని బంజారాబేరి నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం అల్లాదుర్గం తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గోపాల్ నాయక్,దశరథ్, కిషన్, రంగ్‌లాల్,రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడా పెడా విద్యుత్ కోతలు

● జిల్లా కేంద్రంలో గంటల తరబడి కట్
● దోమలు, ఉక్కపోతతో ప్రజల అవస్థలు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గాలివాన లేదు.. వర్షాలులేవు.. ఇదీ వేసవి కూడా కాదు.. అయినా మెదక్ జిల్లా కేంద్రంలో ఎడా పెడా విద్యుత్ కోతల విధిస్తున్నారు. పగలు, రాత్రి అని తేడా లేకుండా ఇష్టానుసారంగా కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు గంటల తరబడి పవర్ కట్ చేయడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ వైపు అనధికార కోతలు.. మరో వైపు ఉక్కపోత, దోమల బెడదతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిమిషాల వ్యవధిలో నిలిపివేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను అడిగితే లైన్ ప్రాబ్లం అంటూ సమాధానమిస్తున్నారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో పట్టణ వాసులు ఇక్కట్లపాలవుతున్నారు. రాత్రి సమయంలో సెల్ లైట్‌లోను గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ వైపు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాను లక్ష్యమని పేర్కొంటున్న ట్రాన్స్‌కో అధికారులు ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

రోడ్లను నిర్మించాలని బీఆర్ఎస్ రాస్తారోకో


బీఆర్ఎస్ రాస్తారోకో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండలంలోని అనంతసాగర్, సత్యగామ, అంత్వార్, జూక్కల్, చందాపూర్ గ్రామాలకు రోడ్లు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట శివారులోని జూక్కల్ క్రాస్ రోడ్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉండి అనేక అభివృద్ధి పనులు చేశానన్నారు. ఆయా రోడ్ల కోసం జీవోలు తీసుకురాగా అంతలోపే ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరుగలేదన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎంపీ ఖేడ్‌కు చెందిన వారే ఉన్నా పనులు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో ఖేడ్ తాజా మాజీ జడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, పోలీసులు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో సహ పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, అభివృద్ధి పనుల పేరిట 13వ వార్డులో బీఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళలు నిర్భయంగా ముందుకు రావాలి

● మెదక్ అదనపు ఎస్పీ మహేందర్


కౌన్సిలింగ్‌లో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో షీటీంలతో నిరంతర నిఘా ఉంచుతున్నామని, మహిళలు మౌనం వీడి నిర్భయంగా ముందుకువచ్చి ఫిర్యాదు చేస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పేర్కొన్నారు. బుధవారం షీటీం కార్యాలయంలో నిర్వహించిన ఆన్‌లైన్ కౌన్సిలింగ్‌కులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినులు, బాలికలకు షీ టీంలతో భరోసా కల్పిస్తున్నామన్నారు. వారి రక్షణ కోసం నిరంతరం పని చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాపంగా గత మూడు నెలలో వేధింపులకు గురి చేస్తున్న 72 మంది ఈవ్ టీజర్లకు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీసు సహాయం పొందాలని సూచించారు. షీ టీం వాట్సాప్ నెంబర్ 8712657963 ఫోన్ చేయొచ్చన్నారు.

ప్రతి ఒక్కరూ పరమాత్మ అనుగ్రహం పొందాలి

● మాధవానంద సరస్వతి స్వామి


భక్తులకు భాషణంలో మాధవానంద సరస్వతి స్వామి

చేగుంట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): దోష రహిత జీవితంతో జీవుడు పరమాత్మ తత్వాన్ని అలవర్చుకోవాలని మాధవానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. చేగుంట మండలం కర్నాల్ పల్లిలో బుధవారం భక్తాంజనేయ షిరిడీ సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం మంటపారాధన, నిర్వాహకులు రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు ఆంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ గుప్తా పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

● డీఎఫ్‌వో శ్రీధర్ రావు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని డీఎఫ్‌వో శ్రీధర్ రావు అన్నారు. బేటి బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సంగారెడ్డి రాజంపేటలోని ఫారెస్ట్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు ఆడపిల్లలే పట్టు కొమ్మలని, వారికి ప్రాముఖ్యతనివ్వాలని అధికారులకు సూచించారు. సీడీపీవో చంద్రకళ, జిల్లా మహిళా సాధికారత కేంద్ర సమన్వయకర్త పల్లవి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరమత సహనాన్ని పెంపొందించుకోవాలి

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలం శివానగర్ జామియా మదర్సా 84వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించాలని వినతి

మనోహరాబాద్ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పంచాయితీ కార్మికులకు జీతాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని జిల్లా కార్మిక సంఘం కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు ఇప్పించాలని బుధవారం మనోహరాబాద్ మండల పంచాయితీ కార్మికులతో కలసి మండల సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 నెలలుగా కార్మికలకు జీతాలు అందడం లేదన్నారు.